www.aksharamedassu.com

APTEL/26/A8343

తెలుగుపత్రిక

అక్షర మేధస్సు

అక్షరమే ఆయుధం మేధస్సే మా మార్గం



ప్రచురణ : అనంతపురం సత్యసాయి | ఎడిటర్ : యన్ రంగనాథ్ | సంపుటి : 01 | సంచిక : 31 | పేజీలు : 04 | శనివారం 21 - 11 - 2026 | వెల : 01/-

విద్యార్థులు ఉద్యోగులుగా కాదు
పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- బీఆర్ఎస్సే ప్రధాన శత్రువని.. బీజేపీ పోటీ కాదు'
- హిందువులను ఒకటి చేయడానికి మోదీ, అమిత్ షా ప్రయత్నం
- అన్ని వర్గాలను కలుపుకుని ముందుకు సాగుతున్న కాంగ్రెస్
- తెలంగాణ విద్యార్థులు ఉద్యోగాలు చేయడమే కాదు.. సంస్థలు స్థాపించాలి
- తెలంగాణలో ఆక్స్‌ఫర్డ్, హార్వర్డ్ క్యాంపస్‌లు



హైదరాబాద్ :

కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలను కలుపుకుని ముందుకు వెళ్తోందని వెల్లడించారు. దేశ జనాభాలో 15 శాతం ఉన్న వాళ్లను కూడా కలుపుకుని వెళ్లాల్సిందే అని చెప్పుకొచ్చారు. బీజేపీ మైనారిటీ రిజర్వేషన్లను ఎందుకు రద్దు చేయలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల కోసం పనిచేస్తోందన్నారు.ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య 100వ పుట్టినరోజు సందర్భంగా సీఎం రేవంత్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈరోజు విద్యానగర్‌లోని రామయ్య నివాసానికి వెళ్లిన ముఖ్యమంత్రి.. ఆయనకు విషెస్ తెలిపారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో అందే విద్య.. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా అందించాలని నిర్ణయించామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లోని 27 లక్షల విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని తెలిపారు. దీనివల్ల ప్రభుత్వ పాఠశాలల్లో హాజరుశాతం కూడా పెరిగిందన్నారు. పదో తరగతి తర్వాత డ్రాప్ అవుట్స్ బాగా ఉన్నాయని చెప్పారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించడం కోసం స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని అన్నారు.స్కిల్స్ యూనివర్సిటీ బోర్డు ఛైర్మన్‌గా ఆనంద్ మహీంద్రా వ్యవహరిస్తున్నారని.. ఇక్కడ చదువుకునే వాళ్లకు వంద శాతం ఉద్యోగాలు లభిస్తున్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. ఐటీఐల్లో పాఠకాలం చదువులే కొనసాగుతున్నాయని.. అందుకే ఐటీసీలుగా మార్చామని వివరించారు. ఐటీసీల కోసం నాలుగు వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని.. ఇందులో టాటా సంస్థ 86 శాతం ఖర్చు పెడుతోందని అన్నారు. - మిగతా 2 లో



నా ఎత్తు, కేటీఆర్ గడ్డం గురించేనా నీ పంచాయితీ?

- సీఎం రేవంత్ ప్రసంగంపై భగ్గుమన్న హరీశ్
- సిద్దిపేట సభలో సీఎం రేవంత్ వ్యక్తిగత విమర్శలకే ప్రాధాన్యమిచ్చారన్న హరీశ్
- కరవు నుంచి దృష్టి మళ్లించేందుకే సీఎం అసత్యాలు, దూషణలకు దిగారని ఆరోపణ
- అబద్ధాల ప్రసంగాలు చేస్తున్నందుకు రేవంత్ ముక్కు నేలకు రాయాలని డిమాండ్

హైదరాబాద్ :

సిద్దిపేటలో నిర్వహించిన ఇందిరమ్మ జీవిత బీమా సభ అట్టర్ ప్లాప్ కావడంతో - మిగతా 2 లో

రాజకీయ కక్షల కోసం
మహిళను అవమానిస్తారా?



- అసదుద్దీన్ ఒవైసీపై టీపీసీసీ చీఫ్ ఫైర్!
- రాజకీయ కక్షలకు మహిళను లక్ష్యంగా చేసుకుంటారా?
- కోట నీలిమపై వ్యాఖ్యలు సరికాదు
- ఒవైసీ వెంటనే క్షమాపణ చెప్పాలి

హైదరాబాద్ :

టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ కోట నీలిమపై ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలను టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ - మిగతా 2 లో



చంద్రుడిపై బంగాళాదుంపల సాగు

- వ్యోమగాముల ఆహార భద్రతకు కీలక ముందడుగు!
- చంద్రుడి మట్టి నమూనాల్లో బంగాళాదుంపల విజయవంతమైన సాగు
- నాసా మద్దతుతో ఒరెగాన్ స్టేట్ యూనివర్సిటీ పరిశోధకుల కీలక ప్రయోగం
- సేంద్రియ ఎరువుతో కలిపిన మట్టిలో భూమితో సమానంగా దిగుబడి
- దీర్ఘకాలిక అంతరిక్ష యాత్రల్లో వ్యోమగాములకు ఆహారం అందించడమే లక్ష్యం
- పండిన దుంపల్లో పోషకాలు భద్రం.. కొన్ని భార లోహాలపై తదుపరి పరిశీలన

ఢిల్లీ :

మానవుడు చంద్రుడిపై స్థిర నివాసం ఏర్పాటు చేసుకునే దిశగా జరుగుతున్న పరిశోధనల్లో మరో కీలక ముందడుగు పడింది. చంద్రుడి ఉపరితలంపై ఉండే మట్టిని పోలిన - మిగతా 2 లో

డ్రగ్స్ రహిత భారత్ నిర్మాణమే లక్ష్యం



- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- డ్రగ్స్ రహిత భారత్‌కు ప్రజల భాగస్వామ్యం అవసరం
- డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి అందరి సహకారం కావాలి
- మాదకద్రవ్యాలపై సమష్టి పోరాటం చేయాలి
- సామాజిక, ఆధ్యాత్మిక, విద్యాసంస్థలు చొరవ చూపాలి

ఢిల్లీ :

డ్రగ్స్ రహిత భారత్ నిర్మాణం కోసం సమాజంలోని అన్ని వర్గాల భాగస్వామ్యం పెరగాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు చేపట్టే కార్యక్రమాలు సాధారణ, నామమాత్రపు చర్యలకే పరిమితం కాకూడదని అన్నారు. ఈ ప్రయత్నాల్లో - మిగతా 2 లో



ఏపీలో చిన్న అణు రియాక్టర్లతో విద్యుత్

- ఎస్ఎంఆర్ సాంకేతికతపై ప్రభుత్వ దృష్టి
- ధర్మల్‌కు ప్రత్యామ్నాయంగా ఎస్ఎమ్ఆర్ అణు విద్యుత్
- ఏపీ ప్రభుత్వ అధికారిక ఆమోదం, జీవో విడుదల
- కాలం చెల్లిన ధర్మల్ ప్లాంట్లలో ఏర్పాటుకు పరిశీలన
- ఏపీజెన్‌కో ప్రతిపాదనలకు సర్కారు పచ్చజెండా
- ప్రైవేట్ రంగ భాగస్వామ్యానికి సైతం అనుమతి

అమరావతి :

ధర్మల్ విద్యుత్‌కు ప్రత్యామ్నాయంగా అత్యాధునిక అణు విద్యుత్ ఉత్పత్తి వైపు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. స్మాల్ మాడ్యులర్ రియాక్టర్ సాంకేతికత ఆధారంగా రాష్ట్రంలో అణు విద్యుత్ కేంద్రాల ఏర్పాటు అవకాశాలను - మిగతా 2 లో

శత్రువులను గడగడలాడించే అమెరికా ఫైటర్ జెట్

- ఎఫ్-22 రాప్టర్ యుద్ధ విమానాల కోసం పాతతరం మెమరీ కార్డులను వెతుకుతున్న అమెరికా
- డేటా బదిలీకి కనీసం 256 ఎంబీ సామర్థ్యమున్న పీసీఎంసీఐఏ, కాంపాక్ట్ ఫ్లాష్ కార్డుల అవసరం
- మిషన్ రూట్లు, రేడియో సెట్టింగులను విమాన వ్యవస్థలోకి లోడ్ చేసేందుకు వీటి వినియోగం
- 1980 నాటి ఎఫ్ఏటీ16 ఫైల్ సిస్టమ్ ఫార్మాట్‌కు మాత్రమే ప్రాధాన్యం

ఢిల్లీ :

ఆకాశాన్ని శాసించే అమెరికా అగ్రశ్రేణి





ఏపీ జడ్పీ ఎన్నికల్లో కూటమి ప్రభంజనం

- 28 స్థానాల్లో ఏకంగా 27 కైవసం!
- టీడీపీకి 22 జడ్పీ ఛైర్మన్ స్థానాలు
- జనసేనకు 4, బీజేపీకి ఒక స్థానం
- వైసీపీకి దక్కిన ఏకైక అల్లూరి జిల్లా
- ఛైర్మన్, వైస్ ఛైర్మన్ వివరాలు ఈసీ ప్రకటన

అమరావతి :

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల సమరంలో అధికార కూటమి విజయదుందుభి మోగించింది. రాష్ట్రవ్యాప్తంగా 28 జిల్లా ప్రజా పరిషత్‌ల ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులకు జరిగిన పరోక్ష ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఏకపక్ష విజయాన్ని నమోదు చేసింది. మొత్తం 28 జడ్పీ పీఠాల్లో ఒక్క అల్లూరి జిల్లా మినహా మిగిలిన 27 జిల్లాలను కూటమి తన ఖాతాలో వేసుకుని గ్రామీణ ప్రాంతాల్లో తిరుగులేని ఆధిపత్యాన్ని చాటుకుంది.రాష్ట్ర - మిగతా 2 లో

తీరం దాటిన 'అక్వాన్' తుపాను



- ఒడిశా, ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు
- తీరం దాటే సమయంలో గంటకు 70 - 90 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలులు
- శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో భారీగా 168.75 మి.మీ వర్షపాతం నమోదు
- ముందస్తు చర్యల్లో భాగంగా పలు రైళ్లు రద్దు చేసిన ఈస్ట్ కోస్ట్ రైల్వే

అమరావతి :

బంగాళాఖాతంలో ఏర్పడిన 'అక్వాన్' తుపాను తీరం దాటింది. ఒడిశాలోని గోపాల్‌పూర్ సమీపంలో ఈ ఉదయం 7.30 నుంచి 8.30 గంటల మధ్య తుపాను తీరాన్ని తాకినట్లు వాతావరణ శాఖ అధికారికంగా ధ్రువీకరించింది. తుపాను తీరం దాటే సమయంలో - మిగతా 2 లో

ఖనిజ సంపదే రాష్ట్రానికి బలం

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- ఏపీఎండీసీని అత్యున్నత స్థాయి మైనింగ్ సంస్థగా తీర్చిదిద్దాలి
- గనుల శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు
- మైనింగ్ రంగంలో ఏపీని అగ్రగామిగా నిలపాలి
- రాష్ట్రంలో కొత్త ఖనిజ నిక్షేపాల గుర్తింపు, వాటి సమర్థ వినియోగం, ఆదాయార్జన అవకాశాలపై చర్చించారు
- ఐపీవో ప్రక్రియకు సీఎం చంద్రబాబు ఆదేశం
- కొత్త ఖనిజ నిక్షేపాల గుర్తింపునకు ఐదేళ్ల ప్రణాళిక



అమరావతి :

రాష్ట్ర ఖనిజ సంపదను భవిష్యత్ తరాలకు విలువైన ఆస్తిగా మలచడమే లక్ష్యంగా ముందుకు సాగాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఏపీఎండీసీని ఎన్ఎండీసీ తరహాలో అత్యున్నత స్థాయి మైనింగ్ సంస్థగా తీర్చిదిద్దాలని దిశానిర్దేశం చేశారు. ప్రైవేట్ ఏజెన్సీల సహకారం తీసుకోవాలని సూచించారు. ఖనిజ వనరులను కేవలం ఆదాయార్జనకు పరిమితం చేయకుండా వాటి విలువను పెంచి రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి వినియోగించాలని స్పష్టం చేశారు. గనుల శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో కొత్త ఖనిజ నిక్షేపాల గుర్తింపు, వాటి సమర్థ వినియోగం, ఆదాయార్జన అవకాశాలపై చర్చించారు. రాష్ట్రంలోని ఖనిజ వనరులు ఇక్కడే వినియోగంలోకి వచ్చేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఖనిజ అన్వేషణ, వేలం ప్రక్రియను వేగవంతం చేసేందుకు వచ్చే - మిగతా 2 లో

సంపాదకీయం

ప్రవాసులకు ప్రోత్సాహకాలు ఏవీ?

విదేశాలలో జీవనోపాధి పొందుతున్న భారతీయులు తమ ఆర్జనతో మాతృదేశాన్ని అనితర సాధ్యంగా ఆదుకుంటున్నారు. వివిధ సందర్భాలలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు అతలాకుతలమైనప్పుడు, ఇతర దేశాలతో పోల్చితే ఆ సంక్షోభాల తీవ్రత భారత్‌పై పెద్దగా ఉండకపోవడానికి కారణం ప్రవాస భారతీయులు స్వదేశానికి పంపే నిధులే. ఇది ఎవరూ నిరాకరించలేని వాస్తవం.ప్రవాస భారతీయులలో ప్రత్యేకించి, చిన్నాచితకా పనులు చేసుకోవడానికి అరేబియా గల్ఫ్ దేశాలకు వచ్చినవారు తమ కుటుంబాలకు పంపుతున్న నిధుల వాటా ఎక్కువగా ఉంటోంది. ఇది నిజం. భారత్‌కు సమకూరుతున్న విదేశీ మారకద్రవ్యంలో సగానికి పైగా ఎడారి దేశాల నుంచి వస్తుండగా మిగిలిన సగం అమెరికా సహా ప్రపంచవ్యాప్తంగా వస్తున్నట్లు రిజర్వు బ్యాంకు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.స్వదేశంలో ఉద్యోగావకాశాలు లేకపోవడంతో మెరుగైన ఉపాధికి విదేశాలకు వలస వెళ్తున్న యువ భారతీయుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. తదనుగుణంగా వారు తమ కుటుంబాలకు పంపిస్తున్న నిధులూ పెరుగుతున్నాయి. 2012 సంవత్సరంలో మూడు లక్షల కోట్ల రూపాయలు పంపించిన ప్రవాస భారతీయులు, 2026లో ఇప్పటిదాకా రూ.12.8 లక్షల కోట్లు పంపించినట్లు అధికారిక గణాంకాలు సూచిస్తున్నాయి. ప్రవాసులు పంపిస్తున్న నిధులను అధికమొత్తంలో అందుకుంటున్న రాష్ట్రాలలో తెలంగాణ నాల్గవ స్థానంలో ఉండగా, ఆంధ్రప్రదేశ్ ఆరవ స్థానంలో ఉంది.దేశ ఆర్థిక వ్యవస్థకు సవాళు ఎదురైన ప్రతిసారీ దాన్ని గట్టెక్కించింది ప్రవాస భారతీయులే. మన పాలకులు ఎందుకనో ఈ వాస్తవాన్ని బాహాటంగా అంగీకరించడం లేదు. భారతదేశ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో ప్రవాసులు పంపే నిధుల వాటా ఇంచుమించు 3శాతం అని అధికారిక నివేదికలే వెల్లడిస్తున్నాయి. అయినా ప్రభుత్వాలు ప్రవాసుల వైపు కనీసం కన్నెత్తి చూడడం లేదు!ఉభయ తెలుగు రాష్ట్రాలతో సహా దేశవ్యాప్తంగా ప్రతి రాష్ట్రమూ సగర్వంగా చెప్పుకునే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)తో పోల్చితే ప్రవాస భారతీయులు పంపే నిధులే ఎక్కువ. తెలంగాణ రాష్ట్రానికి ఇప్పటి వరకు ప్రవహించిన మొత్తం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 3 బిలియన్ డాలర్లు కాగా, ఆ రాష్ట్రానికి చెందిన ప్రవాసులు ఒక్క సంవత్సరంలో పంపించిన మొత్తం నిధులు 12 బిలియన్ డాలర్లు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిన ఎఫ్‌డీఐలు ఒక బిలియన్ డాలర్లకు మించకపోగా, ప్రవాసాంధ్రులు ఒక్క సంవత్సరంలో పంపించిన నిధులు 6.6 బిలియన్ డాలర్లు.భారతదేశ స్థూల దేశీయోత్పత్తిలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల వాటా 1శాతానికి మించి లేదని కూడా అధికారిక గణాంకాలు తేటతెల్లం చేస్తున్నాయి. స్టాక్ మార్కెట్‌లో ఏ మాత్రం ఒడుదుడుకులు చోటుచేసుకున్నా ఆ ఎఫ్‌డీఐలు సైతం క్షణాలలో దేశం దాటి వెళ్లిపోతాయి. పెట్టుబడులు తీసుకువచ్చే ఒక విదేశీ కంపెనీకి మన ప్రభుత్వాలు ఎర్రతివాచీ పరిచి స్వాగతిస్తున్నాయి. అనేక ప్రోత్సాహకాలు అందిస్తున్నాయి. పన్ను రాయితీలతో పాటు భూ పందేరమూ చేస్తున్నాయి. ఏదో ఒక విదేశీ సంస్థ ప్రతినిధులు మన మంత్రులతో సమావేశమై సంప్రదింపులు జరపడం గురించిన వార్తలు ఫొటోలతో సహా నిత్యం పత్రికల్లో కనిపిస్తుంటాయి మరి.తాత్కాలిక విదేశీ పెట్టుబడుల కంటే మూడింతలు ఎక్కువగా శాశ్వత నిధులను తీసుకువచ్చే ప్రవాస భారతీయులను మన పాలకులు సరిగ్గా పట్టించుకోవడం లేదు. అసలు వారి గురించి కనీసం తెలుసుకునే ప్రయత్నం కూడా చేయరు. ఇదేమి వైపరీత్యం! విచారకరమైన విషయమేమిటంటే దేశ ఆర్థికాభివృద్ధిలో తమ పాత్ర ఏమిటో సగటు ప్రవాసులకు సైతం తెలియదు, అటువంటి అవగాహనశక్తి వారికి లేదు. అభివృద్ధి చెందిన దేశాలు సైతం తమ కష్టకాలంలో విదేశీ మారకద్రవ్యాన్ని సమకూర్చుకునేందుకు నానా కష్టాలు పడుతుంటాయి. భారత ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నం చేయకుండానే విదేశాలలోని భారతీయ శ్రామికులు, వృత్తి నిపుణులు మొదలైనవారు మాతృదేశానికి విదేశీ మారకద్రవ్యాన్ని దండిగా సమకూరుస్తున్నారు. జీడీపీలో 1శాతం కూడా ఉండని విదేశీ పెట్టుబడులకు సర్వం దాసోహమంటున్న దేశీయ ప్రభుత్వాలు, మూడు శాతానికి పైగా నిధులు తీసుకువస్తున్న ప్రవాసులను నిరాదరిస్తున్నాయి. ప్రోత్సాహం దేవుడికెరుక, కనీసం ప్రవాస భారతీయ పెట్టుబడిదారుల సాధకబాధకాలనూ వినడం లేదు. వినేందుకు శ్రద్ధ చూపడం లేదు. పెరటి చెట్టు వైద్యానికి పనికిరాదు అనే నానుడి తెలుగు ప్రవాసుల విషయంలో మరింత నిజం.

ఖనిజ సంపదే రాష్ట్రానికి బలం

మొదటిపేజీ తరువాయి - ఐదేళ్ల కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని ఆదేశించారు. ఏపీఎండీసీని స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ చేసేందుకు సీఎం ఆమోదం తెలిపారు. వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి ఐపీఓకు వెళ్లేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. సంస్థ ఈక్విటీ విలువ ఆధారంగా ఐపీఓ ప్రక్రియ చేపట్టాలని నిర్దేశించారు. ఈ మేరకు ప్రతిపాదనలను అధికారులు సమర్పించారు.ఏపీ రేర్ ఎర్త్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటుకు సీఎం ఆమోదం తెలిపారు. రేర్ ఎర్త్ ఖనిజాల అన్వేషణతో పాటు అదనపు విలువ కల్పించడంపై దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఖనిజ నిక్షేపాల గుర్తింపునకు ఆధునిక పద్ధతులు వినియోగిస్తున్నామన్న అధికారులు 74 వేల 860 చదరపు కిలోమీటర్ల పరిధిలో 582 మినరల్ పొటెన్షియల్ ఏరియాలను గుర్తించినట్లు తెలిపారు. వీటిని 209 క్లస్టర్లుగా విభజించినట్లు ముఖ్యమంత్రికి వివరించారు. పెండింగ్‌లోని క్వారీ లీజు దరఖాస్తులు, రెన్యువల్స్ పరిష్కారంపైనా చర్చించారు. 6 వేల 500 క్వారీ లీజు దరఖాస్తులు, 223 రెన్యువల్స్ పెండింగ్‌లో ఉన్నాయి. వీటి పరిష్కారానికి గడువు పొడిగించే ప్రతిపాదనలను అధికారులు పరిశీలనకు తీసుకొచ్చారు. ఈ దరఖాస్తులు, రెన్యువల్స్ పరిష్కారమైతే ప్రభుత్వానికి సుమారు 400 కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉంది.రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరాపైనా ఏపీఎండీసీ దృష్టి పెట్టింది. ఒడిశా, ఝార్ఖండ్‌లోని 3 బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొంటోంది. ఈ మూడు బ్లాకుల్లో కలిపి 1,774.6 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నట్లు ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు.



ఏపీ జడ్పీ ఎన్నికల్లో కూటమి ప్రభంజనం

ఎన్నికల సంఘం ప్రకటించిన వివరాల ప్రకారం, కూటమి భాగస్వామ్య పక్షాల్లో తెలుగుదేశం పార్టీ అత్యధికంగా 22 జడ్పీ ఛైర్మన్ పదవులను కైవసం చేసుకుంది. జనసేన పార్టీ 4 స్థానాలను, భారతీయ జనతా పార్టీ ఒక స్థానాన్ని దక్కించుకున్నాయి. ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేవలం అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్‌కే పరిమితమైంది. అల్లూరి జడ్పీ ఛైర్‌పర్సన్‌గా వైసీపీ అభ్యర్థి వంతల శాంతి ఎన్నికయ్యారు. జిల్లాల వారీగా ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్ల ఎంపిక ప్రక్రియ విజయవంతంగా ముగియడంతో పాటు, ఎన్నికైన వారి పేర్లు, వారు ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీల అధికారిక జాబితాను రాష్ట్ర ఎన్నికల కమిషన్ వెల్లడించింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ రేపిన జిల్లా పరిషత్ పాలకవర్గాల ఎన్నికల ఘట్టం అధికారికంగా పూర్తయింది.

శత్రువులను గడగడలాడించే అమెరికా ఫైటర్ జెట్



మొదటిపేజీ తరువాయి - తరం స్టీల్త్ ఫైటర్ జెట్... గంటకు వేల మైళ్ల వేగంతో దూసుకెళ్లే ఎఫ్-22 రాప్టర్‌ను నడపాలంటే ఇప్పుడు సాంకేతిక ప్రపంచం ఎప్పుడో మరిచిపోయిన ఒక పాత వస్తువు కావాలి. ఆధునిక స్మార్ట్‌ఫోన్‌లో నాలుగైదు ఫోటోలు పట్టేంతటి మెమరీ కూడా లేని 256 ఎంబీ మెమరీ కార్డుల కోసం ఇప్పుడు అగ్రరాజ్యం వెతుకులాట ప్రారంభించింది.ఎఫ్-22 రాప్టర్ యుద్ధ విమానంలో మిషన్ సమాచారాన్ని ఫీడ్ చేయడానికి నేటికీ తొంభైల కాలం నాటి రిమూవబుల్ ఫ్లాష్ మెమరీ కార్డులనే వినియోగిస్తున్నారు. ఫైటర్ జెట్‌లోని డేటా ట్రాన్స్‌ఫర్ కార్ట్రిడ్జ్ (డీటీసీ) వ్యవస్థలో ఈ కార్డులు కీలకం. టేకాఫ్‌కు ముందు ఫ్లైట్ రూట్లు, రేడియో ఫ్రీక్వెన్సీ సెట్టింగ్స్, శత్రు ముప్పునకు సంబంధించిన డేటాను గ్రౌండ్ సిస్టమ్స్ నుంచి విమానంలోకి ఎక్కించేందుకు, అలాగే మిషన్ పూర్తయ్యాక ఫ్లైట్ వివరాలను రీడ్ చేయడానికి పైలట్లు వీటిపైనే ఆధారపడుతున్నారు.ప్రస్తుతం విపణిలో వందల గిగాబైట్ల, టెరాబైట్ల సామర్థ్యం ఉన్న స్టోరేజ్ డివైజ్‌లు అందుబాటులో ఉన్నప్పటికీ, రాప్టర్‌కు మాత్రం పాత కార్డులే కావాలి. కనీసం 256 ఎంబీ సామర్థ్యం ఉన్న పీసీ స్టాండర్డ్ 95 టైప్-2 ఫ్లాష్ కార్డులు లేదా ప్యాసివ్ అడాప్టర్లతో కూడిన కాంపాక్ట్ ఫ్లాష్ (సీఎఫ్) కార్డులను సరఫరా చేయగల అమెరికన్ కంపెనీల కోసం అమెరికా ఎయిర్ ఫోర్స్ తాజాగా నోటీసు జారీ చేసింది. ఆధునిక చిప్‌లు విమానంలోని పాత హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ ఆర్కిటెక్చర్‌కు సరిపోకపోవడమే దీనికి ప్రధాన కారణం.ఈ మెమరీ కార్డులు ప్రభుత్వ హోస్ట్ సిస్టమ్‌తో సమన్వయం కావడంతో పాటు, 1980ల నాటి ఫైల్ అలోకేషన్ టేబుల్ (ఎఫ్ఏటీ16) ఫార్మాట్‌లో ప్రీ-ఫార్మాట్ అయి ఉండాలని ఎయిర్ ఫోర్స్ నిర్దేశించింది. ఏవియానిక్స్ వ్యవస్థలతో సంపూర్ణ అనుకూలత సాధించడానికే ఈ నిబంధన విధించారు. తాజా అవసరాల కోసం ఎయిర్ ఫోర్స్ మార్కెట్ పరిశోధన ప్రారంభించింది. అర్హత గల సంస్థలు 2026 డిసెంబరు 1లోగా వివరాలు సమర్పించాలని కోరింది. 2030 వరకు ఈ రాప్టర్లను సేవల్లో కొనసాగించాలనే యోచనలో ఉన్న పెంటగాన్‌కు, ఈ పాతకాలపు విడిభాగాలను సంపాదించడం ఇప్పుడు ఒక సరికొత్త సవాలుగా మారింది.

చంద్రుడిపై బంగాళాదుంపల సాగు

మొదటిపేజీ తరువాయి - పదార్థంలో బంగాళాదుంపలను విజయవంతంగా పండించి శాస్త్రవేత్తలు చరిత్ర సృష్టించారు. భవిష్యత్తులో చంద్రుడిపైకి వెళ్లే వ్యోమగాములకు అక్కడే ఆహారాన్ని ఉత్పత్తి చేసేందుకు ఈ ప్రయోగం మార్గం సుగమం చేస్తోంది. నాసా మద్దతుతో ఒరెగాన్ స్టేట్ యూనివర్సిటీ పరిశోధకులు జరిపిన ఈ అధ్యయనం వివరాలు 'ఎన్‌పీజే మైక్రోగ్రావిటీ' అనే సైన్స్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.పరిశోధకులు 'మోడోక్' అనే బంగాళాదుంప రకాన్ని ఎంచుకుని, చంద్రుడిపై ఉండే మట్టిని పోలిన ఐదు రకాల నమూనాల్లో ప్రయోగాలు జరిపారు. చంద్రుడి మట్టిలో మొక్కల పెరుగుదలకు అవసరమైన నత్రజని, సేంద్రియ పదార్థాలు ఉండవు. దీంతో కేవలం ఆ మట్టి నమూనాల్లో మొక్కలు నాటగా వేర్లు కానీ, దుంపలు కానీ ఏర్పడలేదు. అయితే, ఈ మట్టి నమూనాలకు వానపాముల ద్వారా తయారైన సేంద్రియ ఎరువును (వర్మీకంపోస్ట్) కలిపినప్పుడు ఫలితాల్లో అద్భుతమైన మార్పు కనిపించింది. కేవలం 5% సేంద్రియ ఎరువు కలిపినా మొక్కలు వేర్లు తొడగడం, దుంపలు ఏర్పడటం ప్రారంభించాయి. ఇక 30% ఎరువు కలిపిన మట్టిలో పండిన పంట, భూమిపై ఒరెగాన్ బంగాళాదుంపల సాగు ప్రాంతంలోని మట్టిలో పండిన పంటతో సమానమైన దిగుబడిని ఇవ్వడం విశేషం.ప్రధాన పరిశోధకుడు ఐమెరిక్ గోయర్ మాట్లాడుతూ.. "చంద్రుడి మట్టిలో నత్రజని అస్సలు ఉండదు, కాబట్టి దానికి పోషకాలు జోడించకుండా ఏ పంటా పండదు" అని వివరించారు. ఈ ప్రయోగంలో పండిన బంగాళాదుంపలను విశ్లేషించగా, వాటిలో పోషక విలువలు చాలా వరకు సురక్షితంగా ఉన్నాయని తేలింది. అయితే, కొన్ని నమూనాలలో భార లోహాల శాతం స్వల్పంగా పెరిగినట్లు గుర్తించారు. దీనిపై మరింత లోతైన అధ్యయనం అవసరమని శాస్త్రవేత్తలు తెలిపారు.నాసా చేపట్టిన 'ఆర్టెమిస్' కార్యక్రమం కింద చంద్రుడిపై మానవుల స్థిర నివాసాన్ని ఏర్పాటు చేయాలనే లక్ష్యానికి ఈ పరిశోధన ఎంతో కీలకం. భూమి నుంచి ఆహారాన్ని పంపించడం అత్యంత ఖర్చుతో కూడుకున్న పని. దీనికి బదులుగా చంద్రుడిపైనే ఆహారాన్ని పండించుకోగలిగితే అంతరిక్ష యాత్రల భారం గణనీయంగా తగ్గుతుంది.తక్కువ ప్రదేశంలో ఎక్కువ కేలరీలు, పొటాషియం, విటమిన్-సి వంటి పోషకాలను అందించే బంగాళాదుంపలు అంతరిక్ష వ్యవసాయానికి అత్యంత అనువైనవిగా భావిస్తున్నారు. ఈ ప్రయోగాలను ప్రస్తుతం భూమిపై గ్రీన్‌హౌస్‌లో, చిన్న కుండీలలో నిర్వహించారని, భవిష్యత్తులో పెద్ద కంటైనర్లలో ప్రయోగాలు చేసి వాస్తవ పరిస్థితుల్లో సాగు సాధ్యమవుతుందో లేదో నిర్ధారించాల్సి ఉందని పరిశోధకులు పేర్కొన్నారు.

తీరం దాటిన 'అక్వాన్' తుపాను

మొదటిపేజీ తరువాయి - తీర ప్రాంతంలో గంటకు 70 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచాయని, అప్పుడప్పుడు వీటి తీవ్రత గరిష్ఠంగా 90 కిలోమీటర్ల వరకు నమోదైందని అధికారులు తెలిపారు.తీరం దాటిన అనంతరం తుపాను ఉత్తర-ఈశాన్య దిశగా ఒడిశా మీదుగా కదులుతోంది. ఇది రాగల మూడు గంటల్లో తీవ్ర వాయుగుండంగా, ఆ తర్వాతి ఆరు గంటల్లో సాధారణ వాయుగుండంగా మరింత బలహీనపడుతుందని వాతావరణ శాఖ వెల్లడించింది.తుపాను ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు దక్షిణ ఒడిశాలో విస్తారంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో అత్యధికంగా 168.75 మి.మీ, అరకబ్రద్రలో 162.50 మి.మీ, కంచిలిలో 148.50 మి.మీ వర్షపాతం నమోదైంది.తుపాను దృష్ట్యా ఈస్ట్ కోస్ట్ రైల్వే ముందుజాగ్రత్తగా పలు రైళ్లను రద్దు చేసింది. ఒడిశా ప్రభుత్వం లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించింది. తుపాను బలహీనపడుతున్నప్పటికీ, ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం తదితర ప్రాంతాల ప్రజలు,అధికారులు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.

విద్యార్థులు ఉద్యోగులుగా కాదు.. పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

మొదటిపేజీ తరువాయి - తెలంగాణ విద్యార్థులు సంస్థల్లో పనిచేయడం కాదని.. సంస్థలనే స్థాపించాలని కోరుకుంటున్నామని తెలిపారు. ఆక్స్‌ఫర్డ్, హార్వర్డ్ లాంటి అంతర్జాతీయ విద్యా సంస్థలు తెలంగాణలో తమ క్యాంపస్‌లు ఏర్పాటు చేయబోతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

రాజకీయ కక్షల కోసం మహిళను అవమానిస్తారా

మొదటిపేజీ తరువాయి - గౌడ్ తీవ్రంగా ఖండించారు.ఆ వ్యాఖ్యలు అనైతికమని పేర్కొన్న ఆయన, ఒవైసీ తక్షణమే తన మాటలను వెనక్కి తీసుకుని కోట నీలిమకు క్షమాపణ చెప్పాలని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.ఉత్తరప్రదేశ్‌లో ఒవైసీ సాగిస్తున్న రాజకీయ కార్యకలాపాలపై కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ పవన్ ఖేరా ఇటీవల విమర్శలు చేశారు. దీనికి ప్రతిస్పందనగా ఒవైసీ.. పవన్ ఖేరాను రాజకీయంగా ఎదుర్కోవాల్సింది పోయి, ఆయన భార్య డాక్టర్ కోట నీలిమను లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యలు చేశారని మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. రాజకీయ చర్చలు ఎంత దిగజారిపోయాయో ఈ ఘటన నిరూపిస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.డాక్టర్ కోట నీలిమ ప్రజాజీవితంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు, స్థానం ఉన్న రాజకీయ నాయకురాలు" అని టీపీసీసీ అధ్యక్షుడు స్పష్టం చేశారు. రాజకీయ విమర్శలకే పరిమితం కావాలి: "పవన్ ఖేరాను విమర్శించే పూర్తి హక్కు ఒవైసీకి ఉంది. ఆయన కాంగ్రెస్ పార్టీని ప్రశ్నించవచ్చు, మా రాజకీయాలతో విభేదించవచ్చు. కానీ రాజకీయ కక్షలు తీర్చుకోవడానికి ఒక మహిళ ఆత్మగౌరవాన్ని కించపరచడం ఏమాత్రం ఆమోద యోగ్యం కాదు" అని ఆయన పేర్కొన్నారు.ప్రజాజీవితంలో ఉన్న మహిళలకు ఇవ్వాల్సిన గౌరవాన్ని నిలబెడుతూ ఒవైసీ వెంటనే క్షమాపణ చెప్పాలని మహేష్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. మరోవైపు, ఒవైసీ వ్యాఖ్యలను నిరసిస్తూ సనత్‌నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఆందోళనలు చేపట్టారు.

నా ఎత్తు, కేటీఆర్ గడ్డం గురించేనా నీ పంచాయితీ

మొదటిపేజీ తరువాయి - సీఎం తీవ్ర నైరాశ్యంలో మునిగిపోయారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఎద్దేవా చేశారు. అసలు సభకు వచ్చిన పథకం గురించి మాట్లాడకుండా తన ఎత్తు, కేటీఆర్ గడ్డం వంటి వ్యక్తిగత విషయాలపై విమర్శలు చేయడానికే రేవంత్ వచ్చారా? అని ప్రశ్నించారు. సొంత జిల్లాలో జనం రాకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి జనాన్ని తరలించిన విషయాన్ని అక్కడి పోలీస్ కమిషనరే స్వయంగా చెప్పారని తెలిపారు. రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర కరవు పరిస్థితుల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే సభలో బూతులు, అబద్ధాలు వల్లెవేశారని ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.నీటిని ఎత్తిపోసేందుకు పంపులు, మోటార్లు లేవంటూ సీఎం చెప్పడం పచ్చి మోసమని హరీశ్ ఆరోపించారు. అలాంటప్పుడు దేవాదుల దగ్గర మోటార్లను పూర్తిస్థాయిలో ఎందుకు నడపడం లేదని, శ్రీశైలం నుంచి కేటాయించిన నీటిని ఎందుకు తోడలేకపోతున్నారని నిలదీశారు.కృష్ణా నదిలో రాష్ట్రానికి రావాల్సిన 299 టీఎంసీలను సైతం ఉపయోగించుకోలేని అసమర్థ స్థితిలో ఈ పాలన ఉందని విమర్శించారు. ట్రిబ్యునల్ ముందు సమర్థంగా వాదనలు వినిపించడంలో సర్కారు ఘోరంగా విఫలమైందన్నారు. అబద్ధాలు చెప్పడంలో రేవంత్‌కు ఆస్కార్ అవార్డు ఇవ్వొచ్చని, సభలో మాట్లాడిన పచ్చి అబద్ధాలకు గానూ సీఎం ముక్కు నేలకు రాయాలని హరీశ్ డిమాండ్ చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లించే పనిలో పడి తెలంగాణ సాగునీటి హక్కులను తాకట్టు పెడుతున్నారని హరీశ్ రావు ఆరోపించారు. కృష్ణా జలాల దోపిడీకి కాంగ్రెస్ సర్కారే ప్రత్యక్షంగా సహకరిస్తోందని మండిపడ్డారు.

ఏపీలో చిన్న అణు రియాక్టర్లతో విద్యుత్

మొదటిపేజీ తరువాయి - పరిశీలించేందుకు ప్రభుత్వం శుక్రవారం అధికారికంగా ఆమోదం తెలిపింది. ఈ మేరకు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ప్రభుత్వ ఉత్తర్వులను (జీవో) జారీ చేశారు.కాలం చెల్లి పదవీ విరమణకు చేరువైన థర్మల్ విద్యుత్ కేంద్రాల స్థానాల్లో లేదా రాష్ట్రంలోని ఇతర అనువైన ప్రాంతాల్లో ఈ సాంకేతికత స్థిరపడిన తర్వాత ఎస్ఎమ్ఆర్ ఆధారిత అణు విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని రాష్ట్రం యోచిస్తోంది. ఏపీజెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ చేసిన ప్రతిపాదనను సమగ్రంగా పరిశీలించిన తర్వాత ప్రభుత్వం ఈ మేరకు అనుమతులు మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టుల్లో ప్రభుత్వ భాగస్వామ్యంతో పాటు ప్రైవేట్ రంగాన్ని కూడా భాగస్వామ్యం చేసేందుకు పచ్చజెండా ఊపారు.కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు నిరంతర విద్యుత్ అవసరాలను తీర్చేందుకు ఈ సరికొత్త న్యూక్లియర్ టెక్నాలజీ భవిష్యత్తులో అత్యంత కీలక పాత్ర పోషించనుంది. తక్కువ విస్తీర్ణంలో, సురక్షితమైన ఆధునిక ప్రమాణాలతో విద్యుత్ ఉత్పత్తిని అందించే ఈ ఎస్ఎమ్ఆర్ విధానాన్ని అమల్లోకి తేవడం ద్వారా రాష్ట్ర ఇంధన భద్రతను పటిష్ఠం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.



డ్రగ్స్ రహిత భారత్ నిర్మాణమే లక్ష్యం

మొదటిపేజీ తరువాయి - సామాజిక సంస్థలు, ఆధ్యాత్మిక సంస్థలు, విద్యాసంస్థలు చురుగ్గా పాల్గొనాలని సూచించారు.సామాజిక న్యాయం, సాధికారత శాఖ నిర్వహించిన విభాగాల స్థాయి సదస్సు ముగింపు సమావేశానికి ప్రధాని మోదీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ రహిత భారత్ (నషా ముక్త్ భారత్) నిర్మాణం కోసం సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.అలాగే దివ్యాంగులను ముందుగానే గుర్తించడం, వారిపై సమాజంలో ఉన్న వివక్ష, అపోహలను తొలగించడం కోసం ప్రజల భాగస్వామ్యం (జన్ భాగీదారీ) పెరగాలని అన్నారు. దివ్యాంగులకు అందుబాటు ధరల్లో సహాయక సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసేందుకు స్టార్టప్‌లను ప్రోత్సహించాలని సూచించారు.ఈ సమావేశానికి సంబంధించిన వివరాలను మోదీ సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో పంచుకున్నారు. సామాజిక సంక్షేమ పథకాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం, అందుబాటు ధరల్లో సహాయక సాంకేతిక పరిజ్ఞానాల అభివృద్ధికి స్టార్టప్‌లను ప్రోత్సహించడం, డ్రగ్స్ రహిత భారత్ కోసం సమాజమంతా కలిసికట్టుగా పనిచేయడం వంటి అంశాలపై సమావేశంలో ప్రధానంగా చర్చించినట్లు వెల్లడించారు.డ్రగ్స్ రహిత భారత్ నిర్మాణం కోసం సమాజంలోని అన్ని వర్గాల భాగస్వామ్యం పెరగాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు చేపట్టే కార్యక్రమాలు సాధారణ, నామమాత్రపు చర్యలకే పరిమితం కాకూడదని అన్నారు. ఈ ప్రయత్నాల్లో సామాజిక సంస్థలు, ఆధ్యాత్మిక సంస్థలు, విద్యాసంస్థలు చురుగ్గా పాల్గొనాలని సూచించారు.

కాకినాడ జిల్లాలో దారుణం

రాయ్ష్ డ్రైవింగ్‌ను ప్రశ్నించినందుకు కత్తులతో దాడి

అతివేగంగా బైక్ నడిపి వాహనాన్ని ఢీకొట్టడమే కాకుండా మందలించినందుకు కక్ష పెంచుకుని దాడిచేసిన ఘటన కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలంలో జరిగింది

రాయ్ష్ డ్రైవింగ్‌ను ప్రశ్నించినందుకు కత్తులతో దాడి



అతివేగంగా బైక్ నడిపి వాహనాన్ని ఢీకొట్టడమే కాకుండా మందలించినందుకు కక్ష పెంచుకుని దాడిచేసిన ఘటన కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలంలో జరిగింది. కిర్లంపూడి మండలం పాలెం గ్రామానికి చెందిన కరణం గంగాధర్ గురువారం రాత్రి పాలెం సెంటర్‌లో స్నేహితులతో మాట్లాడుతున్నారు. అదే సమయంలో గోనెడ గ్రామానికి చెందిన కొప్పిశెట్టి తిరుపతయ్య, అతని అన్న కొడుకు బైక్‌పై అతివేగంగా వచ్చి గంగాధర్ వాహనాన్ని ఢీకొట్టారు. దీంతో గ్రామంలో ఇలా ర్యాష్ డ్రైవింగ్ చేయడమేంటని గంగాధర్‌తో పాటు అక్కడున్న మరికొందరు వారిని ప్రశ్నించారు. దీంతో ఆగ్రహానికి గురైన తిరుపతయ్య, అతని అన్న కొడుకు గంగాధర్‌ను అంతుచూస్తామంటూ బెదిరించి అక్కడి నుంచి వెళ్లిపోయారు.అనంతరం మరో వ్యక్తిని వెంటబెట్టుకుని రాత్రి సమయంలో గంగాధర్ ఇంటికి చేరుకుని కత్తులతో దాడికి పాల్పడ్డారు. అన్నపై దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన తమ్ముడు గణేష్‌పైనా కత్తితో దాడి చేశారు. ఈ ఘటనలో గంగాధర్ మెడ, గడ్డం, చేతులకు గాయాలవగా గణేష్ ఎడమ భుజానికి గాయమైంది. స్థానికులు, కుటుంబ సభ్యులు క్షతగాత్రులను వెంటనే పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిందితులను పట్టుకున్న గ్రామస్థులు ఉదయం దేహశుద్ధి చేశారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు జాతీయ రహదారిపై నేడు(శుక్రవారం) రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. జువ్వలదిన్నె నుంచి నెల్లూరుకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ముగ్గురు యువకులు సూచిక బోర్డును ఢీకొన్నారు. ఈ ఘటనలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. మృతులను విడవలూరు మండలానికి చెందిన మేకల వంశీ, కొండూరు సుబ్రమణ్యంగా పోలీసులు గుర్తించారు. ఘటనపై కేసు నమోదు చేసిన ఎస్సై ముత్యాలరావు దర్యాప్తు చేపట్టారు.పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలం దిగ్గమర్రు బైపాస్‌లో రెండు కార్లు ఢీకొన్నాయి. ఘటనలో నలుగురు యువకులు, ఓ యువతికి గాయా

తెలుగుపత్రిక అక్షర మేధస్సు

శనివారం 21 - 11 - 2026

తాడిపత్రిలో మరోసారి రణరంగం

పరస్పరం రాళ్లు, పెట్రోల్ బాంబులతో దాడులు



తాడిపత్రి నవంబర్ 20 అక్షర మేధస్సు తాడిపత్రి పట్టణం మరోసారి రణరంగంగా మారింది. శుక్రవారం ఉదయం మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇంటిపై జేసీ వర్గీయులు దాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలో కార్లు, ద్విచక్ర వాహనాలను తగలబెట్టారు. ఇంటి వద్ద ఎవరూ లేకపోవడంతో టీడీపీ వర్గీయులు ఒక్కసారిగా చెలరేగిపోయారు. విషయం తెలుసుకున్న పెద్దారెడ్డి వర్గీయులు రాళ్లతో దాడులకు దిగారు. ఇరువర్గాలు పెట్రోల్ బాంబులతో దాడులు చేసుకున్నాయి. దీంతో తాడిపత్రి పట్టణంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విషయం తెలుసుకున్న పోలీసులు భారీగా బలగాలను మోహరించారు.ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ దౌర్జన్యంగా రిగ్గింగ్ చేసి విజయం సాధించిందని పెద్దారెడ్డి ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల్లోనూ ఇదే విధంగా దాడులు జరిగాయని పేర్కొన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేయకుండా భయాందోళనలు కలిగించేందుకే తన ఇంటిపై దాడి చేశారని ఆరోపించారు. ఇలాంటి దాడులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మరోవైపు తాడిపత్రిలో హింసాత్మక ఘటనలకు తనకు ఎలాంటి సంబంధం లేదని మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ప్రజలు వైసీపీని, ముఖ్యంగా పెద్దారెడ్డిని వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు.

విద్యార్థులకు భవిష్యత్తులో ఏఐ సాంకేతిక పరిజ్ఞానమే కీలకం

ఎస్.కె.పి. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కృత్రిమ మేధస్సు సర్టిఫికెట్ కోర్సు ముగింపు

విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేసిన ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. లక్ష్మయ్య



గుంతకల్, నవంబర్ 20 అక్షర మేధస్సు ప్రతినిధి గుమ్మనూరు హరి ప్రస్తుత ఆధునిక సాంకేతిక యుగంలో కృత్రిమ మేధస్సు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ -- ప్రాధాన్యత రోజు రోజుకూ పెరుగుతోందని, విద్యార్థులు ఏఐ సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకొని తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని ఎస్.కె.పి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. లక్ష్మయ్య పేర్కొన్నారు. గుంతకల్ పట్టణంలోని ఎస్.కె.పి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం(ప్రతిపత్తి)లో పీఎం ఉష పథకం జీఐఈఐ కింద సాఫ్ట్ కాంపోనెంట్ కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన కృత్రిమ మేధస్సు సర్టిఫికెట్ కోర్సు ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. లక్ష్మయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతోందని, అందులో కృత్రిమ మేధస్సు కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలని సూచించారు. ఏఐ పరిజ్ఞానం ద్వారా అనేక రంగాల్లో నూతన అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయని, వాటిని అందిపుచ్చుకోవడానికి విద్యార్థులు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని పేర్కొన్నారు. ఇలాంటి సర్టిఫికెట్ కోర్సులు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు భవిష్యత్తులో మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పొందేందుకు దోహదపడతాయని వివరించారు. కార్యక్రమానికి అతిథిగా హాజరైన కళాశాల వైస్ ప్రిన్సిపాల్, పీఎం ఉష కోఆర్డినేటర్ ఎ. రవిశంకర్ శర్మ మాట్లాడుతూ పీఎం ఉష పథకం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధికి అవసరమైన అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకొని తమ విద్యా, వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఏఐ పరిజ్ఞానం భవిష్యత్తులో వివిధ ఉద్యోగ రంగాల్లో కీలకంగా మారనుందని, విద్యార్థులు ఈ సాంకేతికతపై అవగాహన పెంచుకోవడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. యువతకు సాంకేతిక నైపుణ్యాలే భవిష్యత్తుకు బాటలు ఈ సర్టిఫికెట్ కోర్సును యాక్సిస్ పాయింట్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంస్థ సహకారంతో నిర్వహించారు. సంస్థ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ఆర్. శరణ్ కుమార్ విద్యార్థులకు కృత్రిమ మేధస్సుకు సంబంధించిన వివిధ అంశాలపై శిక్షణ అందించారు. ఏఐ సాంకేతికత వినియోగం, దాని ప్రాధాన్యత, ఆధునిక రంగాల్లో దాని ఉపయోగాలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ శిక్షణ ద్వారా విద్యార్థులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలుసుకునే అవకాశం పొందారు.

శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం

ఈ కార్యక్రమాన్ని మహిళా సాధికారత విభాగం కోఆర్డినేటర్ బి. వాణిశ్రీ సమన్వయంతో నిర్వహించారు. కోర్సును విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు. అనంతరం శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల సూపరింటెండెంట్ ఎం. వెంకటేశ్వర బాబు, కామర్స్ అధ్యాపకులు ఎన్.ఎ. అల్తాఫ్, మీడియా కోఆర్డినేటర్ కె. రాజశేఖర్, ఇతర అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్.కె.పి. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

విజ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలే కీలకం -- ప్రిన్సిపల్ డా. ఏ. లక్ష్మయ్య

కళాశాల గ్రంథాలయంలో 40 వేలకు పైగా పుస్తకాలు.. సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచన



గుంతకల్, నవంబర్ 20 అక్షర మేధస్సు ప్రతినిధి గుమ్మనూరు హరి గుంతకల్ పట్టణంలోని స్థానిక ఎస్.కె.పి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం(ప్రతిపత్తి)లో వారం రోజులుగా నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ముగిశాయి. కళాశాల గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ముగింపు కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డా. ఏ. లక్ష్మయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డా. ఏ. లక్ష్మయ్య మాట్లాడుతూ విద్యార్థుల జీవితాల్లో గ్రంథాలయాలు ఎంతో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. పుస్తక పఠనం ద్వారా అపారమైన విజ్ఞానాన్ని సంపాదించుకోవచ్చని, ప్రతి విద్యార్థి తప్పనిసరిగా కళాశాల గ్రంథాలయాన్ని సందర్శించి అందుబాటులో ఉన్న పుస్తకాలను చదివే అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు. పుస్తక జ్ఞానాన్ని ఆర్జించి విజ్ఞానవంతులుగా ఎదిగి, భవిష్యత్తులో ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. వారం రోజులపాటు గ్రంథాలయ విభాగం నిర్వహించిన వివిధ కార్యక్రమాలు, పోటీలు అభినందనీయమని ప్రశంసించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ రవిశంకర్ శర్మ మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచారని తెలిపారు. విజేతలందరికీ అభినందనలు తెలియజేశారు. కళాశాల గ్రంథాలయంలో సుమారు 40 వేలకు పైగా పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకొని తమ జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం వారం రోజులపాటు నిర్వహించిన వివిధ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు విజ్ఞానాభివృద్ధికి దోహదపడింది. ఈ కార్యక్రమంలో కళాశాల లైబ్రేరియన్ ఎం. మల్లేష్, మీడియా కోఆర్డినేటర్ కె. రాజశేఖర్, అధ్యాపకులు ఎన్.ఏ. అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మనూరు రాజేశ్వరి మూడో వర్ధంతి.. కుటుంబ సభ్యుల స్మరణ

భౌతికంగా దూరమైనా.. జ్ఞాపకాల్లో చిరస్థాయిగా!



గుంతకల్లు నవంబర్ 20 అక్షర మేధస్సు ప్రతినిధి గుమ్మ నూరు హరి మూడు సంవత్సరాల క్రితం మృతి చెందిన గుమ్మనూరు రాజేశ్వరి మూడో వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు ఆమెను ఆప్యాయంగా స్మరించుకున్నారు. ఆమె భౌతికంగా తమ మధ్య లేకపోయినా, ఆమె అందించిన ప్రేమానురాగాలు, ఆప్యాయతలు, కుటుంబం పట్ల చూపిన మమకారం ఎప్పటికీ మరువలేమని కుటుంబ సభ్యులు తెలిపారు. గుమ్మనూరు రాజేశ్వరి కుటుంబ సభ్యులతో ఎంతో అనుబంధంగా ఉంటూ, ప్రతి ఒక్కరిపై ప్రేమాభిమానాలు చూపించేవారని గుర్తు చేసుకున్నారు. కుటుంబం పట్ల ఆమె చూపిన శ్రద్ధ, ఆప్యాయతలు తమ జీవితాల్లో ఎప్పటికీ చెరిగిపోని మధుర జ్ఞాపకాలుగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. మూడు సంవత్సరాలు గడిచినా ఆమె జ్ఞాపకాలు తమను వెంటాడుతూనే ఉన్నాయని, ప్రతి సందర్భంలోనూ ఆమె గుర్తుకు వస్తారని కుటుంబ సభ్యులు భావోద్వేగంతో స్మరించుకున్నారు. కాలం గడిచినా తల్లి ప్రేమకు, ఆమె అనుబంధానికి ప్రత్యామ్నాయం ఉండదని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె భర్త రామాంజనేయులు, కుమారులు గుమ్మనూరు హరి, గుమ్మనూరు బాలు తమ ప్రియమైన రాజేశ్వరిని స్మరించుకుంటూ కుటుంబ సభ్యులు నివాళులర్పించారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు

విద్యార్థులకు బహుమతుల ప్రదానం.. పుస్తక పఠనంతోనే విజ్ఞానాభివృద్ధి



పెద్దవడుగూరు, నవంబర్ 20 అక్షర మేధస్సు ప్రతినిధి రంగనాథ్ పుస్తక పఠనంతోనే విజ్ఞానం పెంపొందుతుందని, ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచే గ్రంథాలయానికి వెళ్లి పుస్తకాలు చదవడాన్ని అలవాటు చేసుకోవాలని పలువురు విద్యావేత్తలు సూచించారు. పెద్దవడుగూరు శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. గ్రంథాలయాధికారి పి. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ-1 రాముడు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పుల్లయ్య, ఎంపీపీ మెయిన్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు గౌసియా బేగం హాజరు అయ్యారు అనంతరం మండల విద్యాశాఖ అధికారి రాముడు మాట్లాడుతూ గ్రంథాలయాలు సరస్వతీ నిలయాలని, విజ్ఞానాన్ని అందించే గొప్ప కేంద్రాలని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి గ్రంథాలయాన్ని సందర్శించి అందుబాటులో ఉన్న పుస్తకాలను చదవాలని సూచించారు. పుస్తక పఠనం ద్వారా జ్ఞానం, ఆలోచనా శక్తి, వ్యక్తిత్వ వికాసం పెంపొందుతాయని తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పుల్లయ్య మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని అన్నారు. పాఠ్యపుస్తకాలతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించే ఇతర పుస్తకాలను కూడా చదవడం ద్వారా భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని పేర్కొన్నారు. ఎంపీపీ మెయిన్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు గౌసియా బేగం మాట్లాడుతూ పుస్తకాలు మనిషికి నిజమైన జ్ఞాన సంపద అని అన్నారు. విద్యార్థులు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలని, మంచి పుస్తకాలు జీవితానికి మార్గదర్శకంగా నిలుస్తాయని వివరించారు. "చినిగిన చొక్కా అయినా వేసుకో.. ఒక మంచి పుస్తకం కొనుక్కో" అనే సూక్తిని గుర్తుచేస్తూ పుస్తకాల విలువను విద్యార్థులకు తెలియజేశారు. ఉపాధ్యాయుడు షేక్షావలి మాట్లాడుతూ పెద్దవడుగూరు శాఖా గ్రంథాలయంలో ఆధ్యాత్మిక, పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు, చిన్నపిల్లల కథల పుస్తకాలు, నవలలు తదితర విభిన్న రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రంథాలయాధికారి పి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఎంపీపీ మెయిన్ స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, డ్రాయింగ్, క్రీడా పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా గాంధీ పాఠశాల ఉపాధ్యాయినులు, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ వేడుకల్లో సుమారు 60 మంది విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమంలో పీడీ రామచంద్ర, ఉపాధ్యాయుడు షేక్షావలి, రామాంజనేయులు డ్రాయింగ్ టీచర్ రాజు తదితరులు

ప్రజాస్వామ్య బలోపేతంలో యువత భాగస్వామ్యం ఎంతో కీలకం

18 సం.లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా బాధ్యతగా నమోదు చేసుకోవాలనే అవగాహన కలిగి ఉండాలి

ఎలక్టోరల్ లిటరసీ క్లబ్స్ (ELC) పోటీల విజేతలకు ప్రశంసా పత్రాల ప్రదానం

ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు పిలుపు

జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ. ఆనంద్





అనంతపురం, నవంబర్ 20 అక్షర మేధస్సు భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు, అనంతపురం జిల్లాలోని ప్రాథమికోన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలలు మరియు డిగ్రీ కళాశాలల్లో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్స్ (జూజ) ఏర్పాటు ఆవశ్యకత, ఓటరుగా నమోదు కావడం, బాధ్యతగా వినియోగించుకోవడం వంటి పలు అంశాలపై విస్తృత అవగాహన కొరకు క్విజ్, వ్యాస రచన పోటీలు కార్యక్రమాలు నిర్వహించిన నేపథ్యంలో పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులకు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ ప్రశంసా పత్రాలను అందజేశారు.అనంతపురం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు శుక్రవారం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఈఎల్సి అవగాహన పోటీ కార్యక్రమాల్లో క్విజ్ పోటీలలో 10 మందికి, వ్యాస రచన పోటీల విజేతలకు 10 మంది విజేతలకు ప్రశంసా పత్రాలను అందజేశారు.జిల్లాలోని అన్ని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలల నందు విద్యార్థిని విద్యార్థులకు ఓటరు నమోదు మరియు ఓటింగ్ ప్రాముఖ్యతపై నిర్వహించి అందులో ప్రతిభ కనబరచిన వారికి నియోజకవర్గ స్థాయిలో పోటీలు నిర్వహించగా, అందులో ప్రతిభ కనబరచిన 83 మందికి జిల్లా స్థాయిలో (ఆర్ట్స్ కళాశాల నందు) విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, పాఠశాల మరియు కళాశాల స్థాయి నుండే విద్యార్థులకు ఓటు హక్కు ప్రాముఖ్యతను తెలియజేయడం ఎంతో అవసరమని అన్నారు. 8వ తరగతి నుండి డిగ్రీ చదువుతున్న విద్యార్థులలో 18 ఏళ్లు నిండిన వారు ఇప్పటికే ఓటర్లుగా నమోదయ్యారని, మిగిలిన వారు కూడా రాబోయే 3 నుండి 5 సంవత్సరాలలో ఓటు హక్కు పొందనున్నారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును బాధ్యతాయుతంగా, కచ్చితంగా వినియోగించుకోవాలని సూచించారు. ఎటువంటి డబ్బులు, ప్రలోభాలు లేదా ద్వేషాలకు లోనుకాకుండా, దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించగల సమర్థులైన నాయకులను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. పోటీలలో పాల్గొన్న విద్యార్థులంతా ఓటు హక్కు ఆవశ్యకతను తమ తోటి స్నేహితులకు, సమాజానికి తెలియజేసే బాధ్యత తీసుకోవాలని ఆకాంక్షించారు. మరింత మంది కొత్త విద్యార్థులు ఈ ఎలెక్టోరల్ లిటరసీ క్లబ్స్ నమోదు కావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థిని విద్యార్థులు కలెక్టర్ తో తమ అనుభవాలను పంచుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి (ణ=ా) మలోలా, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ కనక రాజ్, సీనియర్ అసిస్టెంట్ శ్యామ్యూల్, వివిధ పాఠశాలలు, కళాశాలల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు

ప్రాచీన ఆహార సంప్రదాయాలను భావితరాలకు అందించాలి

చిరుధాన్యాల వినియోగంతో ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం

అనంతపురంలో ఘనంగా "ప్రాచీన వారసత్వ వంటకాలు" కార్యక్రమం





అనంతపురం, నవంబర్ 20 అక్షర మేధస్సు ప్రాచీన కాలం నుంచి మన పూర్వీకులు అనుసరిస్తున్న సంప్రదాయ ఆహారపు అలవాట్లను కాపాడుకుంటూ, వాటిని భావితరాలకు వారసత్వంగా అందించాలని అనంతపురం జిల్లా రెవెన్యూ అధికారి ఏ. మలోల పేర్కొన్నారు. చిరుధాన్యాలతో తయారుచేసే ఆహార పదార్థాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని, నాణ్యమైన ఆహారం తీసుకోవడం ద్వారా మెరుగైన జీవన ప్రమాణాలను సాధించవచ్చని తెలిపారు. రాష్ట్ర పురావస్తు మరియు ప్రదర్శనశాల శాఖ కమిషనర్ ముత్యాలరాజు రేవు ఐఏఎస్, జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ఐఏఎస్ నేతృత్వంలో ప్రపంచ వారసత్వ వారోత్సవాలు--2026లో భాగంగా గురువారం అనంతపురంలోని పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు జిల్లా పురావస్తు మరియు ప్రదర్శనశాల ప్రాంగణంలో "అనంతపురం ప్రాచీన వారసత్వ వంటకాలు" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా రెవెన్యూ అధికారి ఏ. మలోల హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ఫాస్ట్ ఫుడ్, రెడీమేడ్ ఆహార పదార్థాలు, అధిక మసాలాలతో కూడిన వంటకాల వినియోగం పెరుగుతోందని అన్నారు. ఇలాంటి ఆహారపు అలవాట్లకు దూరంగా ఉంటూ మన పూర్వీకులు అనుసరించిన చిరుధాన్యాల ఆధారిత ఆహార విధానాన్ని తిరిగి అలవర్చుకోవాలని సూచించారు. సంప్రదాయ వంటకాలు కనుమరుగుకాకుండా వాటి ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర పురావస్తు మరియు ప్రదర్శనశాల శాఖ అనంతపురం సహాయ సంచాలకులు ఎం. స్వామి నాయక్ మాట్లాడుతూ నిత్యజీవితంలో చిరుధాన్యాల వినియోగంతో పాటు వ్యాయామాన్ని కూడా భాగం చేసుకోవాలని సూచించారు. ఫాస్ట్ ఫుడ్, అధిక మసాలా వంటకాలు, రెడీమేడ్ ఆహారాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలన్నారు. మన పూర్వీకులు చిరుధాన్యాలతో కూడిన ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వడం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకునేవారని గుర్తుచేశారు. అలాంటి ఆహార సంస్కృతిని నేటి తరానికి పరిచయం చేయడమే కాకుండా భావితరాలకు వారసత్వంగా అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ కో-కన్వీనర్ పి. కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రాచీన వంటకాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, వాటిని నిత్యజీవితంలో భాగం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సభ్యులు కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మురళీకృష్ణ, షేక్ రియాజుద్దీన్, జూటూరి షరీఫ్, సాధు శేఖర్ మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణకు చిరుధాన్యాల వినియోగం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఇన్నర్ వీల్ సభ్యులు జయంతి, శ్రీవల్లి, లేడీస్ క్లబ్ కార్యదర్శి పద్మజ, రోటరీ క్లబ్ తరపున మేడ రామలక్ష్మి మాట్లాడుతూ కుటుంబ సభ్యులకు నాణ్యమైన ఆహారం అందించడంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. ముఖ్యంగా గృహిణులు సంప్రదాయ చిరుధాన్యాల వంటకాలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా కుటుంబ ఆరోగ్య పరిరక్షణకు తోడ్పడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వంటకాల ఎంపికకు న్యాయనిర్ణేతలుగా డాక్టర్ హేమలత, డాక్టర్ ప్రసన్న, ప్రముఖ చెఫ్ రాకేష్ వ్యవహరించారు. వివిధ సంస్థల ప్రతినిధులు, సభ్యులు, మహిళలు, ఆహారాభిమానులు పాల్గొని ప్రాచీన వంటకాల విశిష్టతను తెలుసుకున్నారు. ప్రాచీన ఆహార సంప్రదాయాలను కాపాడుకోవడం అంటే మన సంస్కృతిని, ఆరోగ్యాన్ని భావితరాలకు అందించడమేనని కార్యక్రమంలో వక్తలు పిలుపునిచ్చారు.

బాలికల భద్రతకు చట్టాలపై అవగాహన ఎంతో అవసరం

గుడ్ టచ్ -- బ్యాడ్ టచ్, పోక్సో చట్టంపై విద్యార్థినులకు అవగాహన కల్పించిన జూనియర్ సివిల్ జడ్జి ఎం. భార్గవి

విద్యార్థినులతో కలిసి భోజనం చేసిన జడ్జి.. హాస్టల్ వసతులు, ఆహార నాణ్యత పరిశీలన



గుంతకల్, నవంబర్ 20 అక్షర మేధస్సు ప్రతినిధి గుమ్మనూరు హరి బాలికలు విద్యతో పాటు తమ హక్కులు, చట్టాలపై కూడా సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని గుంతకల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం. భార్గవి పేర్కొన్నారు. బాలికల రక్షణ, మహిళా సాధికారత, చిన్నారుల హక్కుల పరిరక్షణపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా గుంతకల్లు పట్టణంలోని డోనిముక్కల రోడ్డులో ఉన్న కస్తూరిబా బాలికల పాఠశాల, కళాశాలలో ప్రత్యేక చట్టపరమైన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జూనియర్ సివిల్ జడ్జి ఎం. భార్గవి ఆధ్వర్యం వహించి విద్యార్థినులకు వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలు, వేధింపులు, మహిళలు మరియు చిన్నారుల రక్షణ కోసం అమలులో ఉన్న చట్టాల గురించి ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా బాలికలు చిన్న వయస్సు నుంచే తమ భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

గుడ్ టచ్ -- బ్యాడ్ టచ్‌పై ప్రత్యేక అవగాహన

విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ మధ్య ఉన్న వ్యత్యాసాలను సులభంగా అర్థమయ్యేలా వివరించారు. ఎవరైనా తమ పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, అనుచితంగా తాకినా, వేధింపులకు గురిచేసినా మౌనంగా ఉండకూడదని తెలిపారు. అలాంటి విషయాలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా నమ్మకమైన పెద్దలకు వెంటనే తెలియజేయాలని సూచించారు. తమకు ఇష్టం లేని స్పర్శను ధైర్యంగా తిరస్కరించాలని, భయంతో సమస్యలను దాచిపెట్టకూడదని విద్యార్థినులకు అవగాహన కల్పించారు.

మైనర్ బాలికలకు రక్షణ కవచం పోక్సో చట్టం

మైనర్ బాలికలపై లైంగిక వేధింపులు, దాడులు జరిగినప్పుడు బాధితులకు న్యాయం కల్పించేందుకు పోక్సో చట్టం ద్వారా రక్షణ కల్పిస్తున్నట్లు న్యాయవాదులు వివరించారు. బాలికలపై జరిగే లైంగిక నేరాల విషయంలో చట్టం కఠినంగా వ్యవహరిస్తుందని తెలిపారు. విద్యార్థినులు తమ హక్కులను తెలుసుకోవడంతో పాటు, ఏదైనా సమస్య ఎదురైతే చట్టపరమైన సహాయం పొందేందుకు ముందుకు రావాలని సూచించారు. సమాజంలో బాలికలకు సురక్షితమైన వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

హాస్టల్ వసతులపై జడ్జి ప్రత్యేక పరిశీలన

చట్టపరమైన అవగాహన కార్యక్రమం అనంతరం జడ్జి ఎం. భార్గవి న్యాయవాదులతో కలిసి కళాశాల హాస్టల్‌ను సందర్శించారు. విద్యార్థినులకు కల్పిస్తున్న వసతి సౌకర్యాలు, వంటగది నిర్వహణ, ఆహార పదార్థాల నాణ్యత, కూరగాయలు, వంటకాల తయారీ విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థినులకు ప్రతిరోజూ అందిస్తున్న భోజనం నాణ్యతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వడ్డిస్తున్న అన్నం మెత్తగా ఉండటాన్ని గమనించిన జడ్జి, భోజనం నాణ్యత విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రిన్సిపల్‌కు సూచించారు. విద్యార్థినులకు నాణ్యమైన, శుభ్రమైన, ఆరోగ్యకరమైన ఆహారం అందించాలని, భవిష్యత్తులో ఇలాంటి లోపా

ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ఉచిత వైద్య శిబిరాలు

వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

23వ వార్డు కౌన్సిలర్ గుమ్మనూరు పార్వతి



గుంతకల్, నవంబర్ 20 అక్షర మేధస్సు ప్రతినిధి గుమ్మనూరు హరి: ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతగానోఉపయోగపడతాయని, ప్రతి ఒక్కరూ వీటిని సద్వినియోగం చేసుకోవాలని గుంతకల్ మున్సిపాలిటీ 23వ వార్డు కౌన్సిలర్ గుమ్మనూరు పార్వతి పిలుపునిచ్చారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలు అభినందనీయమని ఆమె పేర్కొన్నారు. గుంతకల్ పట్టణంలోని సత్యనారాయణపేట సచివాలయం వద్ద శుక్రవారం ఉదయం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని కౌన్సిలర్ గుమ్మనూరు పార్వతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా అనేక మంది వివిధ ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స తీసుకోవడం కంటే ముందుగానే వైద్య పరీక్షలు చేయించుకొని వ్యాధులను గుర్తించడం ఎంతో ముఖ్యమని సూచించారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని, వైద్య పరీక్షల కోసం ఆసుపత్రులకు వెళ్లలేని వారు ఇటువంటి శిబిరాలను ఉపయోగించుకోవాలని కోరారు. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల సలహాలు పాటించాలని, అవసరమైనప్పుడు తగిన చికిత్స తీసుకోవాలని ప్రజలకు సూచించారు. సత్యనారాయణపేట సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరానికి స్థానిక ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. పలువురు ప్రజలు శిబిరానికి హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్య సిబ్బంది ప్రజలకు అవసరమైన పరీక్షలు నిర్వహించి ఆరోగ్యపరమైన సూచనలు, సలహాలు అందించారు.

ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నాం

23వ వార్డు పరిధిలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండేలా తన వంతు కృషి చేస్తానని కౌన్సిలర్ గుమ్మనూరు పార్వతి తెలిపారు. వార్డు ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం, సంక్షేమం కోసం నిర్వహించే కార్యక్రమాలకు ఎల్లప్పుడూ సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 23వ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ గుమ్మనూరు భాస్కర్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలి

నూతన ప్రజాప్రతినిధులు ప్రజాసేవకే ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి..

గ్రామాల అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి

పెద్దవడుగూరు మండల నాయకుడు చిన్నవడుగూరు దివాకర్ రెడ్డి



పెద్దవడుగూరు, నవంబర్ 20 అక్షర మేధస్సు ప్రతినిధి రంగనాథ్ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాప్రతినిధుల పాత్ర ఎంతో కీలకమని, ప్రజలు తమ ఓటు ద్వారా అప్పగించిన బాధ్యతను గుర్తించి నూతన ప్రజాప్రతినిధులు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలందించాలని పెద్దవడుగూరు మండల నాయకుడు చిన్నవడుగూరు దివాకర్ రెడ్డి పేర్కొన్నారు. పదవులు అనేవి హోదా కోసం కాకుండా ప్రజలకు సేవ చేయడానికి లభించిన అవకాశాలుగా భావించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో తమ ప్రతినిధులను ఎన్నుకుంటారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేయాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తుంచుకొని వాటిని నెరవేర్చే దిశగా అడుగులు వేయాలన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజల వద్దకు వెళ్లడం కాకుండా, పదవుల్లో ఉన్నంతకాలం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. ముఖ్యంగా తాగునీటి సమస్యలు, రహదారుల నిర్మాణం, సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, వీధి దీపాలు, పారిశుద్ధ్యం వంటి మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేయాలని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను చెప్పుకోవడానికి వచ్చినప్పుడు వారిని నిర్లక్ష్యం చేయకుండా గౌరవంగా పలకరించాలని, సమస్య చిన్నదైనా పెద్దదైనా దాని పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం ఉంటేనే అభివృద్ధి పనులు వేగవంతమవుతాయని పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన పనులను గుర్తించి సంబంధిత అధికారులతో చర్చించి నిధుల మంజూరుకు కృషి చేయాలన్నారు. అలాగే గ్రామాల్లో యువతకు ఉపాధి అవకాశాలు, విద్యార్థులకు మెరుగైన విద్యా సదుపాయాలు, మహిళలకు సంక్షేమ పథకాలు, రైతులకు అవసరమైన ప్రభుత్వ సహకారం అందేలా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని సూచించారు. గ్రామాల అభివృద్ధిలో మహిళలు, యువత, రైతులు, వృద్ధులు సహా అన్ని వర్గాల ప్రజల అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలందరినీ సమానంగా చూడాలని, ఎన్నికల సమయంలో ఉన్న రాజకీయ విభేదాలను పక్కనపెట్టి గ్రామాభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం జరగకుండా ఎప్పటికప్పుడు స్పందిస్తూ ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నారు. ప్రజాప్రతినిధుల పనితీరు వారి మాటల్లో కాకుండా ప్రజలకు అందించే సేవల్లో, గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల్లో కనిపించాలని దివాకర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజల ఆశీర్వాదంతో లభించిన పదవులకు న్యాయం చేస్తూ, ప్రజల కష్టసుఖాల్లో తోడుగా నిలవాలని, పెద్దవడుగూరు మండలంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నూతన ప్రజాప్రతినిధులందరూ సమష్టిగా కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు.

తిరుపతి రీజియన్ పరిశ్రమలు, ఉద్యాన కేంద్రంగా రూ.9 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు



కీలక రంగాల్లో పెట్టుబడులను సాధించడం ద్వారా తిరుపతి ఆర్థిక రీజియన్‌ను ప్రగతిబాట పట్టించాలని ప్రభుత్వం భావిస్తోంది.కీలక రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా తిరుపతి ఆర్థిక రీజియన్‌ను ప్రగతిబాట పట్టించాలని ప్రభుత్వం ఆశిస్తోం. పరిశ్రమలు, పునరుత్పాదక విద్యుత్, ఉద్యాన రంగాలతో పాటు ప్రతిపాదన దశలో ఉన్నవి కలిపి మొత్తం రూ.9 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు రావొచ్చని అంచనా వేసిం. ఈ రీజియన్‌ను 2047 నాటికి రూ.0.9 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకుం. తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, వైఎస్సార్ కడప, శ్రీ సత్యసాయి, అనంతపురం, కర్నూలు, నంద్యాల, నెల్లూరు జిల్లాలతో కూడిన ఈ రీజియన్‌లో ఒక్కో జిల్లా ఒక్కో విశిష్టతను చాటిచెప్పేలా ప్రణాళిక రూపొందించారు .ప్రణాళికాబద్ధమైన నగరాలు: ఎలక్ట్రానిక్స్‌లో శ్రీసిటీ-తడ-సూళ్లూరుపేట, క్రిస్‌సిటీగా కృష్ణపట్నం, స్పేస్ సిటీగా నాయుడుపేట, షిప్‌బిల్డింగ్‌లో దుగరాజపట్నం, ఆటోమొబైల్, ఈవీలో ఓర్వకల్లు, స్టీల్, సిమెంట్‌లో కొప్పర్తి-కడప-జమ్మలమడుగు, ఆటో, ఈవీ బ్యాటరీలు, ఎలక్ట్రానిక్స్‌లో పెనుకొండ-పాలసముద్రం-హిందూపురం, టూరిజంలో రేణిగుంట-శ్రీకాళహస్తి, ఏరో స్పేస్‌లో పుట్టపర్తి, పునరుత్పాదక విద్యుత్, ఫుడ్ ప్రాసెసింగ్‌లో అనంతపురం, ఆటో, ఈవీ, బ్యాటరీలలో చిత్తూరు-కుప్పం కారిడార్, ఫుడ్ ప్రాసెసింగ్‌లో మదనపల్లె, సిమెంట్‌లో నంద్యాల, నాలెడ్జ్ సర్వీసెస్‌లో గ్రేటర్ తిరుపతి, కర్నూలు, బ్రౌన్‌ఫీల్డ్ ప్రాజెక్టుల విస్తరణలో నెల్లూరు ప్రణాళిక బద్ధమైన నగరాలుగా వృద్ధి చెందుతున్నాయి.ఉద్యానాభివృద్ధి ప్రణాళికలో 80 శాతం: రాష్ట్రంలో 201 క్లస్టర్లలో సమగ్ర ఉద్యానాభివృద్ధి ప్రణాళిక అమలు చేస్తుండగా, వాటిలో 185 రాయలసీమలోనే ఉన్నాయి. ఈ రంగంలో లక్ష కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడి అంచనాలు ఉండగా, వాటిలో 80 శాతం తిరుపతిలోనే ఉన్నాయి. డెయిరీ, మీట్, కోళ్ల పెంపకం, ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ క్లస్టర్లు, టెర్మినల్ మార్కెట్లలో పెట్టుబడి ప్రతిపాదనలు ఉన్నాయి.విమాన తయారీ రంగంలోనూ: శ్రీసత్యసాయి, తిరుపతి, కర్నూలు జిల్లాలు ఎయిర్‌క్రాఫ్ట్ తయారీ, నిర్వహణ, మరమ్మత్తులకు కేంద్రాలుగా ఉన్నాయి. ఏరోస్పేస్, డిఫెన్స్ పాలసీ కింద ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల పెట్టుబడులు రానున్నాయి. దీని ద్వారా లక్ష మంకి ఉద్యోగాలు దక్కనున్నాయి. కడప, కర్నూలు విమానాశ్రయాల్లో శిక్షణ, పరీక్షలకు గగనతలం అందుబాటులో ఉం. ఫ్లైట్ టెస్ట్ అండ్ ఇంటిగ్రేషన్ బెల్ట్, ఏరోస్ట్రక్చర్ అండ్ ప్రెసిషన్ పార్క్, కాంపొనెంట్ అండ్ ఇంజిన్ ఎంఆర్‌వో హబ్, ఫ్లయింగ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లు, డ్రోన్ టెస్ట్ కారిడార్ ల్యాబ్‌లలో పెట్టుబడి ప్రతిపాదనలు ఉన్నాయి.రక్షణ రంగానికి శ్రీసత్యసాయి జిల్లా కీలకం: రక్షణ రంగ పరికరాల తయారీ రంగంలో శ్రీసత్యసాయి జిల్లా ఎనర్జిటిక్స్, క్షిపణులకు ప్రధాన కేంద్రంగా ఉండగా, దుత్తలూరు, ఓర్వకల్లు ద్వితీయ కేంద్రాలుగా ఉన్నాయి. 2029 నాటికి దేశంలో 34 బిలియన్ డాలర్ల రక్షణ ఉత్పత్తులు ఉంటాయని అంచనా. కాగా ఇందులో 5-7 శాతం తిరుపతి రీజియన్‌లోనే ఉండనున్నాయి. ఎనర్జెటిక్స్, మందుగుండు జోన్, మందుగుండు ప్రూఫ్ రేంజ్, డ్రోన్ టెస్ట్ కారిడార్, డిఫెన్స్ సప్లయర్ పార్క్‌లో ప్రతిపాదిత పెట్టుబడులు రానున్నాయిఎలక్ట్రానిక్స్‌కు హబ్: రాష్ట్రంలో 50 బిలియన్ డాలర్ల విలువైన ఎలక్ట్రానిక్స్, వాటి విభాగాలు తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో 70-80% పెట్టుబడులు తిరుపతి పరిధిలోని శ్రీసిటీ, నాయుడుపేట సెజ్‌లలో ఏర్పాటు చేసే ప్రాజెక్టుల్లో ఉంటాయి. ఎలక్ట్రానిక్స్‌లో భారీ యూనిట్ల ద్వారా వచ్చే పెట్టుబడులలో 98 శాతం ఈ రీజియన్‌లోనే ఉన్నాయి. అప్లయెన్స్ వెండర్ పార్క్, పీసీబీ కామన్ ప్లేటింగ్ అండ్ సీఈటీపీ, పాసివ్ కాంపొనెంట్ పార్క్, ఎలక్ట్రానిక్స్ టెస్ట్ ల్యాబ్, ఇన్‌ల్యాండ్ కంటైనర్ డిపోల్లో పెట్టుబడులు రానున్నాయి.పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులు: పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులు ప్రధానంగా తిరుపతి రీజియన్‌లోనే ఏర్పాటు అవుతున్నాయి. క్లీన్ ఎనర్జీ పాలసీ కింద 2029 నాటికి రాష్ట్రంలో 113 డాలర్ల పెట్టుబడులు రానున్నాయి. అయితే ఇందులో 80 శాతం ఈ రీజియన్‌లో ఉండనున్నాయి. 20 గిగావాట్ల ఇంటిగ్రేటెడ్ సోలార్ చైన్, పంప్స్ అండ్ బ్యాటరీ స్టోరేజ్, గ్రీన్ అమ్మోనియా హబ్, విండ్ కాంపొనెంట్స్ పార్క్‌లలో పెట్టుబడులు రానున్నాయి.అంతరిక్ష ఆర్థిక వ్యవస్థకు మూలం: స్పేస్‌లాంచ్, తయారీ, మరమ్మత్తులు, సేవా రంగాల్లో తిరుపతి రీజియన్ కీలక పాత్ర పోషిస్తుం. దేశంలోని ఏకైక ఆర్బిట్ లాంచ్‌సైట్ ఈ రీజియన్‌లోనే ఉం. తిరుపతి స్పేస్ సిటీలో మొదటి బ్లాక్ కోసం 2,800 ఎకరాలు కేటాయించారు. కాగా గాదంకిలోని ఎన్ఏఆర్ఎల్, తిరుపతి ఐఐటీ, ఐఐఎస్ఈఆర్ ఈ రంగంలో పరిశోధనా కేంద్రాలుగా ఉన్నాయి. కామన్ అసెంబ్లీ టెస్ట్ ఫెసిలిటీ, కమర్షియల్ లాంచ్ కాంప్లెక్స్, లింక్ స్పేస్ టు టూరిజం అండ్ స్కిల్స్, షార్‌కు 6 వరుసల కారిడార్ నిర్మాణంలో పెట్టుబడుల ప్రతిపాదనలు ఉన్నాయి.

రూపాయి ఖర్చు లేకుండా మాతృత్వం గాంధీ ఐవీఎఫ్ సెంటర్‌లో ముగ్గురు శిశువుల జననం

సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో ఉచితంగా అంచిన ఐవీఎఫ్ చికిత్స ద్వారా ఏళ్లుగా సంతానం కోసం ఎదురుచూసిన ముగ్గురు దంపతులకు ఆ ఆనందం దక్కిం. శ్రీగాంధీ ఆసుపత్రిలో ఐవీఎఫ్‌తో సంతానం ఏళ్లుగా సంతానం కోసం ఎదురుచూస్తున్న కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసిం. గతంలో పిల్లలు పుట్టని దంపతుల జీవితాల్లో గాంధీ ఆసుపత్రి కొత్త వెలుగును నింపిం. సుదీర్ఘ నిరీక్షణ తర్వాత తల్లిదండ్రులు కావడంతో వారు ఎంతో సంతోషంతో మునిగిపోయారు. గాంధీ ఆసుపత్రిలోని ఐవీఎఫ్ కేంద్రంలో, వైద్యులు అత్యాధునిక సంతానోత్పత్తి సాంకేతికత ద్వారా ముగ్గురు జంటలకు సంతాన భాగ్యాన్ని కృంచారు. ప్రైవేట్ వైద్యం ఆర్థికంగా భారంగా మారిన తరుణంలో, ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న ఈ ఐవీఎఫ్ సేవల ద్వారా తమ కలదండ్రులు కావాలనే కల నెరవేరడంతో ఆ దంపతులు ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.16 ఏళ్ల నిరీక్షణ తర్వాత లభించిన వరంవరంగల్‌కు చెంన కారు డ్రైవర్ రాజు (38), ఆయన భార్య దాసరి స్వరూప (35) దంపతులు 16 ఏళ్లుగా పిల్లల కోసం ఎదురుచూస్తున్నారు. గతంలో వారు ప్రైవేట్ ఆసుపత్రిలో ఐవీఎఫ్ చికిత్స కోసం సుమారు రూ.3--4 లక్షలు ఖర్చు చేసినప్పటికీ ఎటువంటి ఫలితం రాలేదు. ఆర్థిక ఇబ్బందుల వల్ల మరిన్ని చికిత్సలు చేయించుకోలేని పరిస్థితిలో ఉన్న వారికి గాంధీ ఆసుపత్రిలో ఉచితంగా ఐవీఎఫ్ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిసిం. ఇక్కడ వైద్యులు అందించిన చికిత్సతో స్వరూప పండంటి మగబిడ్డకు జన్మనిచ్చారు.శ్రీగాంధీ ఆస్పత్రిలో ఐవీఎఫ్‌తో ముగ్గురికి సంతానం పదేళ్లకు కల సాకారమయ్యిందియాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన సెక్యూరిటీ గార్డు విజయ్ కుమార్ (35), ఆయన భార్య పీసరి మాధవి (35) పదేళ్లుగా సంతానం కోసం వేచి చూశారు. ప్రైవేట్ రంగంలో ఐవీఎఫ్ చికిత్సకు అయ్యే భారీ ఖర్చును భరించలేక, వారు గాంధీ ఆసుపత్రి వైద్యులను ఆశ్రయించారు. ఇక్కడ ఐవీఎఫ్ చికిత్స పొందగా ఈ నెల 18న మాధవి ఆరోగ్యవంతురాలైన ఆడబిడ్డకు జన్మనిచ్చారు. తమకు అండగా నిలిచిన గాంధీ ఆసుపత్రి వైద్యులకు, నర్సులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.డిసెంబర్‌లో మరో ముగ్గురు జంటలు ఐవీఎఫ్ పద్ధతి ద్వారా సంతానాన్ని పొందే అవకాశం ఉం. ఇప్పటివరకు ఈ కార్యక్రమం ద్వారా తొమ్మి జంటలకు పిల్లలు కగారు. సంతానలేమితో బాధపడుతున్న జంటలు ఆసుపత్రిని సంప్రదించవచ్చు. అక్కడ వైద్యులు వారి పరిస్థితిని పరిశీంచి, వారికి ఐవీఎఫ్ అవసరమా లేక సాధారణ చికిత్సలే సరిపోతాయా అన్నది నిర్ణయిస్తారు - డాక్టర్ ఉషారాణి, గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్రైతు కుటుంబంలో ఆనందంవికారాబాద్ జిల్లాకు చెంన అనంతయ్య, శనమ్మ అనే రైతు దంపతులకు వివాహమై తొమ్మిదేళ్లు దాటినా సంతానం కలగలేదు. గతంలో వారు ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఐవీఎఫ్ చికిత్స కోసం దాదాపు రూ.3 లక్షలు ఖర్చు చేసినా ఫలితం దక్కలేదు. చివరకు వారు గాంధీ ఆసుపత్రి వైద్యులను సంప్రంచగా అక్కడ చేసిన ఐవీఎఫ్ చికిత్స విజయవంతమైం. ఈ నెల 18న వారికి మగబిడ్డ జన్మించాడు. మరో ముగ్గురు జంటలకు కూడా త్వరలోనే సంతాన భాగ్యం కలిగే అవకాశం ఉంది.

ఎస్వీ అన్నప్రసాద ట్రస్టు రూ.3000 కోట్ల మార్క్ దాటిన విరాళాలు



తిరుమల శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకు భక్తుల నుంచి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. గత రెండేళ్లలో ఈ ట్రస్టుకు ఏకంగా రూ.1100 కోట్ల విరాళాలు అందాయనిుణ అన్నప్రసాద కేంద్రంలో వంటసామగ్రికి పూజలు నిర్వహిస్తున్న టీటీడీ అదనపు ఈవో వెంకయ్యచౌదరి తిరుమల శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకు భక్తుల నుంచి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. గత రెండేళ్లలో ఈ ట్రస్టుకు ఏకంగా రూ.1100 కోట్ల విరాళాలు అందాయని, టీటీడీకి వచ్చిన మొత్తం విరాళాల్లో 53 శాతానికి పైగా అన్నప్రసాద ట్రస్టుకే లభించాయని టీటీడీ అదనపు ఈవో వెంకయ్యచౌదరి వెల్లడించారు. దీంతో ప్రస్తుతం ట్రస్టు నిధులు సుమారు రూ.3,100 కోట్ల మైలురాయిని చేరుకున్నాయన్నారు.గురువారం తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద సముదాయంలో ఆయుధపూజ ఘనంగా జరిగిం. ఈ సందర్భంగా అదనపు ఈవో వెంకయ్యచౌదరి మాట్లాడుతూ సాధారణ రోజుల్లో 3 లక్షలకు పైగా, బ్రహ్మోత్సవాల్లో రోజుకు 4.60 లక్షల మం భక్తులకు అన్నప్రసాద వితరణ జరుగుతున్నట్లు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో టీటీడీ పరిధిలోని 65 అనుబంధ ఆలయాల్లోనూ అన్నప్రసాద వితరణ అందుబాటులో ఉండేలా చర్యలు చేపడతామన్నారు.2 వేల మంతో ప్రారంభం: శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఉచిత అన్నప్రసాదాన్ని అంంచాలనే లక్ష్యంతో వంగత ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు 1985లో అన్నదాన పథకాన్ని ప్రారంభించారు. 2014లో దీనిని శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్‌గా టీటీడీ పేరు మార్చిం. తొలుత 2,000 మంతో ప్రారంభమైన అన్నప్రసాద వితరణ దినదినప్రవర్ధమానమవుతోం. ప్రస్తుతం రోజుకు లక్ష మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేసే స్థాయికి ట్రస్ట్ అభివృద్ధి చెం.రుచిగా, శుచిగా అన్నప్రసాద వితరణ: ఎస్వీ ట్రస్టుకు గతేడాది నాటికి 9.7 లక్షల మంది దాతలు ఉండగా, వీరిలో రూ.కోటి, అంతకుమించి విరాళమిచ్చిన వారు 139 మంది ఉన్నారు. ఒక్కరోజు అన్నప్రసాద వితరణకు రూ.44 లక్షలు అయ్యే ఖర్చవుతోం. కాగా ఇప్పటివరకు 249 మం దాతలు విరాళం అందజేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక తిరుమలలో అన్న ప్రసాదంపై టీటీడీ ప్రత్యేక దృష్టి సారించింది. భక్తులకు మరింత రుచిగా, శుచిగా అన్నప్రసాదం వితరణ పాటు భోజనం మెనూలో వడలను కూడా వడ్డిస్తున్నామని గతంలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు పేర్కొన్నారు. టీటీడీ అందిస్తోన్న అన్నప్రసాదంపై భక్తులు కూడా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఆయన సామాజిక మాధ్యమం "ఎక్స్"లో పోస్టు చేశారు.ఆయుధపూజ కార్యక్రమంలో టీటీడీ స్పెసిఫైడ్ అథారిటీ ఛైర్మన్, ఈవో ఎం.రవిచంద్ర, సీవీఎస్‌వో మురళీకృష్ణ, అన్నప్రాదం డిప్యూటీ ఈవో రాజేంద్ర, శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో భాస్కర్, క్యాటరింగ్ ప్రత్యేకాధికారి శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై నిట్, ఐఐటీ విద్యార్థుల పరిశోధనలు

ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ వేదికపై ప్రజెంటేషు



హైదరాబాద్‌లో 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్‌ను నిర్వహించారు. ఈ వేదికపై నిట్, ఐఐటీ విద్యార్థులు రోడ్డు భద్రతపై చేసిన పరిశోధనలను ప్రదర్శించారు. 2026ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ 2026 రోడ్డు భద్రత అనేది ప్రధానమైన అంశం. పొద్దున లేస్తే చాలు ప్రతి ఒక్కరూ ఏదో ఒక పని మీద బయటికి వెళ్తూనే ఉంటారు. ఈ క్రమంలో వాహనదారులు, పాదచారులకు ఇలా ఎవరికైనా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వాలు రోడ్డు భద్రతలో ఎప్పటికప్పుడు ఎన్నో మార్పులు చేస్తున్నాయి. హైదరాబాద్‌లో ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ సందర్భంగా ప్రముఖ ఐఐటీ, ఎన్ఐటీ విద్యార్థులు రోడ్డు భద్రతపై చేసిన పరిశోధనలను ఆవిష్కరించారు. ఈ ప్రెజెంటేషన్లు గుత్తేదార్లు, ఇంజినీర్లను ఆకట్టుకున్నాయి.హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఈ సదస్సును గురువారం ప్రారంభమైం. మీర్ అలీ నవాజ్ జంగ్ బహద్దూర్ హాల్, మోక్షగుండం విశ్వేశ్వరయ్య హాల్‌లో విద్యార్థులు తమ పరిశోధన పత్రాలను అధికారులకు వివరించారు. వీరిలో 9 మం ఐఐటీయన్లు, నలుగురు నిట్ విద్యార్థులు అలాగే ఇద్దరు ఇంజనీరింగ్ స్టూడెంట్లు ఉన్నారు.ఏఐ ఆధారిత డ్రైవింగ్ లైసెన్స్ టెస్ట్ఈ పరిశోధనల్లో మొదటి అంశం ఏఐ ఆధారిత డ్రైవింగ్ లైసెన్స్ టెస్ట్. దీనిపై కాలికట్ నిట్ విద్యార్థి జియిత్ జయేశ్‌కుమార్ అధ్యయనం చేశారు. దేశంలో జరుగుతున్న ప్రమాదాలన్నీ 95 శాతం మానవ తప్పిదాల వల్లనే జరుగుతున్నాయని ఆయన పరిశోధన చేశారు. వాటిని తగ్గించేందుకు డ్రైవింగ్ లైసెన్స్ పరీక్షలో అభ్యర్థి సామర్థ్యాలను పక్కాగా అంచనా వేసే ఫ్రేమ్‌వర్క్‌ను సిద్ధం చేశారు. నిజజీవితంలో ఎదురయ్యే సమస్యలు రవాణాశాఖ ప్రస్తుతం చేస్తున్న పరీక్షల్లో లేవని, అలాగే అభ్యర్థి సామర్థ్యాలను అంచనా వేయడంలో డేటా ఆధారిత ప్రమాణాలు లేవని అంటున్నారు.విద్యార్థులకు ట్రాఫిక్ పాఠాలువిద్యార్థులకు వర్చువల్ రియాలిటీతో ట్రాఫిక్ పాఠాలను నేర్పించాలనే అంశంపై, నిట్ కాలికట్ విద్యార్థి నీరజ చంద్రశేఖర్ పరిశోధన జరిపారు. ప్రతిరోజూ పాఠశాలకు నడుచుకుంటూ వెళ్లే పిల్లలకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగమని తెలిపారు. పద్మవ్యూహంలాంటి ట్రాఫిక్‌లోనూ వారు సులభంగా వెళ్లొచ్చని చెబుతున్నారు. 3డీ ద్వారా ప్రతి దశలో పాదచారుల పనులు, ట్రాఫిక్ తీరు, ఎదురయ్యే అడ్డంకులను సృష్టించారు. ఒక్కసారి వీఆర్ హెడ్‌సెట్‌ను పెట్టుకుని వాస్తవంగా సంబంధ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఎలా ఉంటుందనే విషయం తెలుసుకోవచ్చు. అలాగే ఎలాంటి అడ్డంకులు వస్తాయనే కూడా నేర్చుకోవచ్చు.

ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ నివాసంలో ఈడీ సోదాలు

ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ నివాసంలో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. గతంలో ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు జరిగాయని, దానిపై తనిఖీలు చేస్తున్నట్లు సమాచారం.ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ ఇంట్లో ఈడీ సోదాలు నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలో మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ నివాసంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు సోదాలు చేపట్టారు. గతంలో ఖానాపూర్, జగిత్యాల ప్రాంతాల్లో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి అవకతవకలు జరిగాయనే ఆరోపణలు, ప్రభుత్వానికి చెల్లించాల్సిన సొమ్ము చెల్లించలేదనే అంశాలపై ఈ తనిఖీలు చేపట్టినట్లు సమాచారం.రేఖానాయక్ 2014 నుంచి వరుసగా రెండుసార్లు బీఆర్ఎస్

పేదల ఆరోగ్యానికి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరం

ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన 1వ వార్డు కౌన్సిలర్ ఊడదాల ప్రభాకర్



గుంతకల్, నవంబర్ 20 అక్షర మేధస్సు ప్రతినిధి గుమ్మనూరు హరి గుంతకల్ పట్టణంలో పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని 1వ వార్డు కౌన్సిలర్ ఊడదాల ప్రభాకర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని స్వీపర్ కాలనీలో ఉన్న సచివాలయం వద్ద శుక్రవారం ఉదయం పేద ప్రజల కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని 1వ వార్